



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## ( 1963 జనవరి సినిమారంగం నుంచీ పునర్ముద్రణ)

### ధూళిపాళ

ధూళిపాళ సీతారామ శాస్త్రిగారు దాచేపల్లి, (గురజాల తాలూకా)లో జన్మించారు. ఈయన తండ్రి అక్కడే ఉండి వ్యవసాయం చేసుకుంటున్నారు. గుంటూరులో ఇల్లు, భూములు వున్నాయి. ఇతనికి ఒక అమ్మాయి, ఇద్దరబ్బాయిలు ఉన్నారు. పెద్దమ్మాయికి పెళ్ళయింది. కొడుకులిద్దరూ చదువుకుంటున్నారు.



ధూళిపాళగారు మొదట చదువుతున్న రోజుల్లో 'శ్రీ కృష్ణ తులాభారం'లో నళిని వేషం వేశారు. అతడు స్త్రీ పాత్రకు సమర్థుడని అతనికి చిన్న చిన్న స్త్రీ పాత్రలు ఇచ్చేవారు. ఇతను 'చింతామణి'లో 'రాధ', 'బొబ్బిలియుద్ధం'లో 'మల్లమాంబ' పాత్రలను ధరించసాగారు. బాపట్ల సంస్కృత కళాశాలలో పంచకావ్యాల వరకు చదువుకున్నారు. హిందీలో విశారదుడు. నాటకాలు ఆడుకుంటూనే హిందీ ఇన్‌స్టిట్యూట్ పెట్టి పదిమంది పిల్లలకు చదువు చెప్పేవాడు. 1942లో ధూళిపాళకు కీ.శే మాధవపెద్ది వెంకట్రామయ్యగారితో పరిచయమయ్యింది. అప్పటివరకు ఆడవేషాలు వేస్తూ వుండేవారు. వెంకట్రామయ్యగారు ధూళిపాళగారి శక్తిసామర్థ్యాలు చూసి "అబ్బాయ్ నీవీ ఆడవేషాలు వేస్తూ కూచుంటే ప్రయోజనంలేదు. మొగవాడివాయె – మొగవేషాలు వేసి నీ మొగతనం చూపించు. ఆడవేషాలకు

ఆడవాళ్ళువున్నారుగా" అన్నారు. అప్పటినుండి ధూళిపాళగారు ఆడవేషాలకు స్వస్తి చెప్పి మగవేషాలు ధరించసాగారు. వెంకట్రామయ్యగారు చక్కని మార్గం నేర్పారు. ఆయనే భావ ప్రకటన, సంభాషణ పలికేతీరు, నటన మొదలైన అన్ని విషయాలు ట్యూషన్ చెప్పారు.

ముందుగా ధూళిపాళగారికి సహదేవుడు, నకులుడు పాత్రలలో రంగస్థలంపై మగతనం ఏర్పడింది. తర్వాత తర్వాత గయుడు, దుర్యోధనుడు వంటి పాత్రలను ధరించసాగాడు. గుంటూరులో వున్న స్టార్ థియేటర్లో చాలా నాటకాలలో పాల్గొన్నారు. ఈ సమాజం వారు గయోపాఖ్యాయం, బొబ్బిలియుద్ధం, వరవిక్రయం, ఉద్యోగ విజయాలు ఊరూర ప్రదర్శించి ప్రజల మెప్పును పొందారు.

1949లో గుంటూరులో చెళ్ళపిళ్ళ సన్మాన సంఘంవారు నాటక పోటీలు ఏర్పాటు చేశారు. అనేక సంఘాలవారు ఉద్యోగ విజయాలు ఆడారు. ఆ సమయంలో దుర్యోధనుని పాత్రలో ఉత్తమ నటుడిగా బహుమతి వచ్చింది. చెళ్ళపిళ్ళవారి ఆశీర్వాదంతో సువర్ణ నటరాజ విగ్రహాన్ని ధూళిపాళకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత నటననే వృత్తిగా స్వీకరించవలసి వచ్చింది. అనేక ఊళ్ళలో, పల్లెలలో, పట్నాలలో నాటకాలు ఆడారు. అనేక చోట్ల సన్మానాలు పొందారు.

1958లో గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తులో 'మయసభ' ఘట్టానికి పోటీ జరిగింది. దుర్యోధన పాత్రకు ధూళిపాళకు బహుమతి లభించింది.

ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారిచే శాలువను బహుమతినిచ్చి ఆధరాభిమానాలు చూరగొన్నారు.

1962లో ఒక మరువరాని సంఘటన జరిగింది. అదేమిటంటే విశాఖపట్నం కల్చరల్ అసోసియేషన్ వారు కొన్ని నాటకాలను ప్రదర్శింపచేశారు. అందులో ఉద్యోగ విజయాలు నాటకం. ఐనా మయసభ నుంచే నాటకం ప్రారంభమైంది.

మయసభలోని దుర్యోధనుడు అద్వితీయంగా నటించి ప్రేక్షకులను తన్మయులుగా చేశారు. ఆనాటి ప్రదర్శనకు గుమ్మడిగారు అధ్యక్షులు. ఆ సభవారు గుమ్మడి వెంకటేశ్వరరావు గారికి ఒక సరస్వతి విగ్రహం సమర్పించారు. ప్రదర్శనాంతరం గుమ్మడిగారు ధూళిపాళను మెచ్చుకుంటూ 'ఆ నటుడెవరో నేను ఎరగను కాని వారు వయస్సులో నాకంటే పెద్దవారో చిన్నవారో తెలియదు. కాని నాకు సభవారు ఇచ్చిన బహుమతిని దుర్యోధన పాత్రధారికి సమర్పిస్తున్నాను' అని విగ్రహాన్ని, గుమ్మడి ధూళిపాళకు బహూకరించారు. ఇంతటి గౌరవం తనకు కలిగినందుకు ధూళిపాళ ఉప్పొంగిపోయారు. వారిద్దరికి ఇదే ప్రథమ పరిచయం.

ఆ తర్వాత అదే సంవత్సరంలో (1961) గుంతకల్లులో ధూళిపాళకు నట సన్మానం జరిగింది. అక్కడ కూడా మయసభలో ధూళిపాళకు ఖద్దరు శాలువ బహూకరించారు. ధూళిపాళకు సభానంతరం శ్రీ కె. వేణుగోపాల్, శ్రీ జి.యస్. రాము మొదలగు వారు అతని నటనను చూచి మెచ్చుకుని వారికి కలిగిన అభిప్రాయాలను వెల్లడించారు. శ్రీ భీమరావుగారు కూడా కృతజ్ఞతలు తెలియచేశారు.

బి.ఏ. సుబ్బారావుగారు భీష్మ చిత్రం తీస్తున్నప్పుడు దుర్యోధనుని పాత్ర ఎవరికివ్వాలి అని అనుకుంటూ మంచి సమర్థుడైన వానికివ్వాలని అనుకుంటున్నారు.

ధూళిపాళ నాటకాలు ప్రదర్శిస్తూ మద్రాసుకు  వచ్చి వెళుతుండేవారు. చాలాకాలం నుంచి చిత్రాలలో నటించాలని ఆయనకు ఉంది.

ఆ రోజుల్లో కృష్ణగాన సభలో 'రోషనార' నాటకం ప్రదర్శన మద్రాసులో జరిగింది. ఆ ప్రదర్శనలో రామసింహుని పాత్ర ప్రేక్షకులను ఆకర్షించింది. నాటకానంతరం ప్రముఖులంతా గీన్ రూమంలో కెళ్ళి నటులందరిని ప్రశంసించారు. 'రామసింహుడి' పాత్రను బాగా కొనియాడారు. ఈ పాత్రధారి ధూళిపాళ సీతారామశాస్త్రిగారు. ఆనాడు ప్రదర్శన చూచిన వారిలో బి.ఎ.సుబ్బారావు ఒకరు. ఆ నాటకం మర్నాడు ధూళిపాళగారు బి.ఎ సుబ్బారావుగారిని కలుసుకున్నారు. ఆ తర్వాత తన ఊరెళ్ళిపోయాడు.

నాటకాలలో దుర్యోధన పాత్రకు మంచి పేరున్నదని బి.ఎ సుబ్బారావుకు తెలుసు. ఉన్నట్టుండి 'రోషనార'లో స్వయంగా అతనిని చూడటం జరిగింది. ఆ కారణంగా సుబ్బారావుగారు ధూళిపాళకు ఉత్తరం వ్రాశారు, తాను ఎదురు చూడకుండా ఉన్నట్లుండి ఛాన్సు వెతుక్కుంటూ వచ్చినందుకు ధూళిఫాళ సంతోషించాడు. ఈ విధంగా భీష్మ చిత్రంలో దుర్యోధనుడి పాత్ర ధరించాడు. ధూళిపాళ పూర్వీకులుగాని బంధువుల్లోగాని వెతికినా నటకులు దొరకరు.

అట్లాగే దర్శకుడు రామినీడు చెవిలోబడ్డాడు. 'కలిమిలేములు' చిత్రంలో విలన్ 'నరసయ్య' పాత్రధారణకు ఈ పేరే కారణమైంది. ఈయనెప్పుడు సాంఘిక నాటకాలు వేసినవాడు కాదు.

ధూళిపాళ ఇటీవల విడుదలైన 'మహామంత్రి తిమ్మరుసు'లో 'పెద్దన'గాను 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో 'గయుడు 'గాను ' మదనకామరాజు కథ'లో రాజగురువుగాను, 'లవకుశ 'లో 'వశిష్టుడు 'గాను ఇంకా ‘పార్వతి పరిణయం’ మొదలగు చిత్రాలలో నటిస్తున్నారు.

ఈ విధంగా ధూళిపాళగారు అటు నాటకరంగంలోను సినిమారంగంలోను అద్వితీయమైన పాత్రలను ధరింపసాగుచున్నారు.

ఈయనకు ఆ కళామతల్లి ఆయురారోగ్యమొసంగి కళకు సేవగాంచు వారిని ఆశీర్వదించమని కోరుచున్నాను.

**రచనః వేణుగోపాల్**

Post your comments